## రూ.63 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సిడిపిఒ పద్మ



**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** అంగన్‌వాడీ టీచర్ల నుంచి రూ.63 వేల లంచం తీసుకుంటూ మెట్‌పల్లి సీడీపీఓ పద్మా ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. కరీంనగర్ రేంజ్ ఇన్‌చార్జ్ ఏసీబీ డీఎస్పీ గౌరె మధు ఆధ్వర్యంలో శనివారం ఈ ట్రాప్ నిర్వహించినట్లు సమాచారం. లంచం మొత్తాన్ని స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు సీడీపీఓను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను ఏసీబీ అధికారులు వెల్లడించాల్సి ఉంది.


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం | 27 సెప్టెంబరు, 2026 | పేజీలు :08


# అంబేద్కర్ ఆశయాలే సమాజ ప్రగతికి బాటలు

కరీంనగర్ బస్‌స్టేషన్‌లో బాబాసాహెబ్ విగ్రహావిష్కరణ
మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/కరీంనగర్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లో మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. కరీంనగర్ పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం మంత్రులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తాను 2013లో పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా కరీంనగర్ బస్‌స్టేషన్‌కు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరు పెట్టినట్లు తెలిపారు. 13 ఏళ్ల తర్వాత అదే ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విగ్రహావిష్కరణకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, దొంత రాజయ్య తదితరులను అభినందించారు. అంబేద్కర్ కేవలం రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడు మాత్రమే కాదని, సమాజంలో సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనేత అని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించడంతో పాటు అణగారిన వర్గాలు ఆత్మగౌరవంతో జీవించేందుకు బలమైన పునాది వేసిందన్నారు. ప్రతిరోజూ వేలాది మంది రాకపోకలు సాగించే బస్‌స్టేషన్ ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ప్రత్యేకమైన విషయమన్నారు. ఈ విగ్రహాన్ని చూసే ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను, రాజ్యాంగ విలువలను గుర్తుచేసుకునే అవకాశం ఉంటుందన్నారు. యువత అంబేద్కర్ జీవితాన్ని, ఆయన ఆలోచనలను అధ్యయనం చేయాలని సూచించారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల భద్రత అనే మూడు ప్రధాన అంశాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు.

**మార్పు మన నుంచే రావాలి:** మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సబ్బండ వర్గాల ప్రజల జీవితాల్లో మార్పు వచ్చినప్పుడే సమాజంలో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మనలో మార్పు రాకపోతే వెనుకబాటుతనం కొనసాగుతుందని, అంబేద్కర్ చూపిన మార్గంలో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతోందని మంత్రి శ్రీహరి అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా అందించిన అవగాహనను, ఆయన సిద్ధాంతాలను ఆచరణలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, అంబేద్కర్ విగ్రహాన్ని బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేయడం ద్వారా ఆయన రాజ్యాంగ స్ఫూర్తిని నిత్యం ప్రజలకు గుర్తుచేసే అవకాశం కలిగిందన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకుంటూనే అంబేద్కర్ ఆశయాలను ఆచరణలోకి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అంబేద్కర్ విగ్రహం ప్రజలకు, ముఖ్యంగా యువతకు సామాజిక న్యాయం, సమానత్వం పట్ల స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోలగాని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, శ్రీరామ్ చక్రవర్తి, సరిత తిరుపతయ్య యాదవ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, చరణ్ కౌశిక్ యాదవ్, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

---

30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన



**ప్రజాపక్షం/ రాజన్న సిరిసిల్ల :** ఈనెల 30వ తేదీన బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి రానున్న నేపథ్యంలో అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆదేశించారు. అంతకుముందు మంత్రులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పుష్ప గుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. ఈనెల 30 సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా ఇంఛార్జీ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, మంత్రులు శ్రీధర్ బాబు, ఎస్టీ దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతె, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు, అలాగే సిరిసిల్ల రగుడు బైపాస్ రోడ్ వద్ద ఉన్న మైదానంలో పబ్లిక్ మీటింగ్ నిర్వహించనున్నారని తెలిపారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు ట్రాఫిక్, బందోబస్తు, భద్రత చర్యలు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సత్యనారాయణ గౌడ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

---

# శాంతిభద్రతల రక్షణలో 'శివంగి'

ఉమ్మడి జిల్లాలో శాంతి విప్లవానికి రూపశిల్పి ఎస్‌పి షర్మిల

**ప్రజాపక్షం/నిర్మల్ :** ఒకప్పుడు ఉద్రిక్తతలకు, ఆకస్మిక అలజడులకు వార్తల్లో నిలిచే జిల్లాలో ఈనాడు ప్రశాంతత వికసిస్తోంది. మతసామరస్యానికి ప్రతీకగా "హిందూముస్లిం భాయ్ భాయ్" నినాదాలతో గణేష్ నిమజ్జన శోభాయాత్రలు మార్మోగుతున్నాయి. జిల్లాను ప్రశాంత నిలయంగా మార్చడంలో, అన్ని వర్గాల ప్రజలను సమన్వయం చేస్తూ శాంతిభద్రతలను కాపాడటంలో నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, IPS పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయంగా మారింది. గత మూడు సంవత్సరాలుగా భైంసా, నిర్మల్ పట్టణాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ఒక శివంగిలా నిలబడి శాంతియుత వాతావరణాన్ని కాపాడుతూ ఆమె రాష్ట్ర స్థాయిలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.



**నిర్మల్ గణేష్ నిమజ్జనానికి 700 మందితో పటిష్ట బందోబస్తు :** నిర్మల్ పట్టణంలో జరగనున్న గణేష్ నిమజ్జన శోభాయాత్రను అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. బుధవారపేటలోని ఎం.కె. ఫంక్షన్ హాల్‌లో విధుల్లో పాల్గొనే పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల స్వయంగా బ్రీఫింగ్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు మరియు మసీదుల వద్ద నిరంతరం నిఘా ఉంచాలని, విధుల్లో ఉండే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

**సాంకేతిక నిఘా – 8 సెక్టార్లుగా విభజన :** భద్రతను సుమారు 700 మంది పోలీస్ బలగాలతో పర్యవేక్షిస్తున్నారు. ఇందులో 1 అదనపు ఎస్పీ, 1 ఏఎస్పీ, 15 మంది డీఎస్పీలు, సుమారు 50 మంది సీఐలు, ఎస్సైలు మరియు సిబ్బంది భాగస్వాములయ్యారు. శోభాయాత్ర మార్గాన్ని 8 సెక్టార్లుగా విభజించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడమే కాకుండా, అత్యవసర సమయాల్లో వినియోగించేందుకు 'లిఫ్టింగ్ అండ్ పుషింగ్' పార్టీలను సిద్ధంగా ఉంచారు. మొత్తం మార్గంలో 106 సీసీ కెమెరాలు, 4 డ్రోన్ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

**భైంసాలో మతసామరస్యం.. స్వయంగా పర్యవేక్షించిన ఎస్పీ:** మరో వైపు, గతంలో సున్నిత ప్రాంతంగా పేరున్న భైంసా పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర అత్యంత భక్తిశ్రద్ధలు, సోదరభావం మధ్య ప్రశాంతంగా ముగిసింది. శోభాయాత్ర మార్గాల్లో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ బందోబస్తును, ట్రాఫిక్ క్రమబద్ధీకరణను పర్యవేక్షించారు. ప్రజలు, మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించడంతో శోభాయాత్ర సజావుగా సాగింది. నిమజ్జనం ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన ప్రజలకు, మండప నిర్వాహకులకు పోలీస్ శాఖ కృతజ్ఞతలు తెలిపింది.

**ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన "లేడీ సింగం" :** రాష్ట్రంలోనే ఎప్పుడూ సున్నితమైన ప్రాంతాలుగా భావించే భైంసా, నిర్మల్ పట్టణాలలో శాంతిభద్రతలను పునరుద్ధరించడంలో ఎస్పీ జానకి షర్మిల ముందంజలో నిలిచారు. అన్ని మతాలు, అన్ని వర్గాల పెద్దలను, ప్రజలను కలుపుకొనిపోతూ సామరస్య వాతావరణాన్ని పెంపొందించడంలో ఆమె విజయం సాధించారు. కఠినమైన శాంతిభద్రతల అమలుతో పాటు ప్రజల్లో నమ్మకాన్ని నింపేలా వ్యవహరిస్తూ, జిల్లాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో ఒక శివంగిలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ప్రజల నుండి, ప్రభుత్వం నుండి విశేష ప్రశంసలు అందుకుంటున్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా చింతకుంట లోని రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి ఉత్సవాల్లో స్థానిక కార్పొరేటర్ గడ్డి ప్రదీప్ మాజీ వైస్ ఎంపిపి భూక్యా తిరుపతి నాయక్ కలిసి మాజీ మేయర్ సర్దార్ రవిందర్ సింగ్ చాకలి ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీందర్ సింగ్ మాట్లాడుతూ తెలంగాణ సమాజంలో మహిళా చైతన్యానికి ఆత్మ గౌరవ పోరాటానికి చాకలి ఐలమ్మ జీవితం గొప్ప స్ఫూర్తిదాయకమని అన్నారు. భూమి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. సామాజిక అన్యాయాలను, దొరల పెత్తనాన్ని ఎదిరిస్తూ ధైర్యంగా పోరాడిన చాకలి ఐలమ్మ త్యాగాలు , తెగువు నేటి యువతకు ఆదర్శమని అన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం ఆమె చేసిన త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమానత్వం, సామాజిక న్యాయం, ఆత్మ గౌరవ విలువలను కాపాడుకోవాలని అన్నారు. ఆమె పేరు మీద చింతకుంట గ్రామంలో



ఎస్ఆర్ఎస్పి కెనాల్ వద్ద బస్ స్టాఫ్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు రాచకొండ శశిధర్, రేణికుంట రాజు, రజక సంఘం నాయకులు గట్టయ్య, శ్రీనివాస్, అనిల్, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

## నూతన సారథులకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పంజాల రాధాస్వామిగౌడ్‌ను, కాంగ్రెస్ పార్టీ అంతర్గాం మండల అధ్యక్షుడు సింగం కిరణ్‌కుమార్‌గౌడ్‌ను రామగుండం పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండి.గౌస్‌బాబా ఆధ్వర్యంలో సన్మానించారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డీసీసీ ప్రధాన కార్యదర్శి పూదరి సత్తయ్యగౌడ్, మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్, గౌడ సంఘం నాయకులు సింగం సత్తయ్యగౌడ్, బందారపు బుగ్గరాములుగౌడ్, కాంగ్రెస్ రామగుండం పట్టణశాఖ మాజీ అధ్యక్షులు అప్పాసి శ్రీనివాస్, అంతర్గాం మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ గౌస్‌పాషా, గౌడ సతీష్‌కుమార్, కాసర్ల శంకర్, నంది సంతోష్‌లు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలను సాకారం చేయడమే మంత్రి శ్రీధర్ బాబు లక్ష్యం

**ప్రజాపక్షం/ముత్తారం :** పేదవారి సొంత ఇంటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,ప్రభుత్వం పనిచేస్తోందని గ్రామ సర్పంచ్ కొట్టె అన్నపూర్ణ ఉపేందర్ అన్నారు.రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు శనివారం మండల పరిధిలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో బోనగాని గీతాంజలి చిన్ని నూతన ఇందిరమ్మ ఇంటి స్లాబ్ నిర్మాణ పనులను సర్పంచ్ కొట్టె అన్నపూర్ణ ఉపేందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ,వార్డు సభ్యులు మార్తా మహేందర్,వీరగోని అజయ్,కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు గడ్డం శశి కుమార్,బోనగాని రాజమౌళి,బోనగాని సాగర్,రాజు,సంతోష్,కొమురయ్య,సమ్మయ్య తో పాటు గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## లీగల్ అడ్వైజర్‌గా పూదరి చంద్రశేఖర్ నియామకం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** శనివారం రోజున వినియోగ దారుల హక్కుల సంస్థ పెద్దపల్లి జిల్లా లీగల్ అడ్వైజర్ గా పూదరి చంద్రశేఖర్ పటేల్ ను నియమించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మడ్డి శ్రావణ్ వారికి నియామక పత్రాన్ని అందజేశారు. వారి వెంట జిల్లా కార్యదర్శి పూదరి అనిల్ పటేల్, జిల్లా ఆర్గనైజర్ సెక్రటరీ మచ్చ మహేష్,సోషల్ మీడియా ఇంచార్జి రేకుంట సంతోష్ సిఆర్ఒ సభ్యులు అభి విద్యాసాగర్ పాల్గొన్నారు.

## తెలంగాణ మహిళా స్ఫూర్తిదాయిని చాకలి ఐలమ్మ

**ప్రజాపక్షం/హుజురాబాద్ :** తెలంగాణ మహిళా స్ఫూర్తిదాయిని, పేదల హక్కుల కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్ నిమ్మటూరి సాయికృష్ణ అన్నారు. హుజురాబాద్ పట్టణంలోని ఏరియా ఆసుపత్రి వద్ద గల ఐలమ్మ విగ్రహం వద్ద శనివారం చిట్యాల ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐలమ్మ ఆశయాలను నేటి తరానికి పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ సామాజిక, సమానత్వం, మహిళల ఆత్మగౌరవం, పేదల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. కిషన్, మున్సిపల్ మేనేజర్ భూపాల్ రెడ్డి, ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, రాజపల్లి సర్పంచ్ కట్టుకూరి మల్లారెడ్డి, కౌన్సిలర్లు భారతి, పుణ్యలత, సొల్లు సునీత, మొగిలి, సమ్మయ్య, బండ సింధూజ, బండ నరేష్, శ్రీనివాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## తెలంగాణ ఎన్‌టిపిసి విద్యుత్తు ప్లాంటుకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం ఎన్‌టిపిసి తెలంగాణ స్టేజ్2లోని యూనిట్3 నూతన విద్యుత్తు ప్లాంటుకు సంబంధించి సివిల్ నిర్మాణ పనులను ఎన్‌టిపిసి ఈ.డి.(ఆర్అండ్‌టి) చందన్ కుమార్ సమంత భూమిపూజ చేసి ప్రారంభించారు. మెయిన్ ప్లాంటు పనులను బిహెచ్‌ఈఎల్ సంస్థ ఈపీసీ వెండార్‌గా చేపట్టనుంది. సివిల్ పనులు యూనిట్ల వారీగా జరగనున్నట్లు అధికారులు తెలిపారు. స్టేజ్2లో మొత్తం 3 యూనిట్లు(యూనిట్3, 4, 5) ఒక్కొక్కటి 800 మెగా వాట్ల సామర్థ్యంతో నిర్మించనున్నారు. వీటిని సూపర్ క్రిటికల్ యూనిట్లుగా నిర్మాణం చేయనున్నారు. యూనిట్3 ప్యాకేజీలో టీజీ మెయిన్ పవర్‌హౌజ్, బాయిలర్ ఫౌండేషన్, ఈఎస్‌పి సివిల్ పనులు చేపట్టనున్నారు. నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించేందుకు ఎయిర్ కూల్డ్ కండిషనర్(ఎసీసీ) టెక్నాలజీని వినియోగించనున్నారు. ఈ మూడు యూనిట్లను 2030 సెప్టెంబర్ నాటికి క్రమంగా కమిషనింగ్ చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎన్‌టిపిసి అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిపిసి ఉన్నతాధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



## ఎఐటియుసి చేసిన ఒప్పందంపై చర్చకు సిద్ధం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఏఐటియుసి చేసిన ఒప్పందాలపై చర్చకు సిద్ధమని, ఏఐటీయూసీ పై విమర్శించే నైతిక హక్కు ఇతర సంఘాలకు లేదని,సింగరేణిలో కార్మికుల పెండింగ్ సమస్యలపై లేబర్ కమిషనర్ వద్ద జరిగిన అగ్రిమెంట్ ను ఫేక్ అంటున్న వారు లేబర్ లీడర్లు ఎలా అవుతారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ప్రశ్నించారు. శనివారం సింగరేణి ఆర్జీ1 ఏరియాలోని జీడీకే 11వ ఇంక్లైన్ మరియు జీడీకే 1వ ఇంక్లైన్ లలో జరిగిన ఏఐటీయూసీ గేట్ మీటింగ్ లలో ఆయన పాల్గొని మాట్లాడారు.సింగరేణిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, అప్పటి గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ విధానాల వల్ల లాభాల్లో ఉన్న సంస్థకు చెందిన కోట్లాది రూపాయల సొమ్మును విచ్చలవిడిగా ప్రభుత్వ పథకాలకు వాడుకుని నిర్వీర్యం చేసి, కార్మికులకు, సంస్థకు తీరని నష్టం చేశారని ఆరోపించారు. తెలంగాణ సెంటిమెంట్ పేరుతో గెలిచిన టీబీజీకేఎస్ యూనియన్ 2012 నుంచి 2023 వరకు 11 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు కార్మికులకు ఏం హక్కులు సాధించిందని ప్రశ్నించారు. పైగా చందా డబ్బుల కోసం రెండు వర్గాలుగా చీలి, గుర్తింపు కోసం ఎన్నికలు పెట్టిన చరిత్రను కార్మికులు మరచిపోలేదని విమర్శించారు.సింగరేణి బొగ్గును, కరెంటును వాడుకుని రూ. 26 వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా సంస్థను అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. సింగరేణికి రావాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయిలు వసూలు కాకపోవడం వల్ల కొత్త యంత్రాలు తేవాలన్నా, పనిముట్లు కొనాలన్నా,సేఫ్టీ మెటీరియల్ తెప్పించాలన్నా డబ్బుతో ముడిపడి ఉందని, అవి లేకుంటే కార్మికులు బొగ్గు ఉత్పత్తి ఎలా చేస్తారని ప్రభుత్వాన్ని,యాజమాన్యాన్ని ప్రశ్నించారు. కొత్త గనులు వస్తేనే సంస్థ మనుగడ పది కాలాల పాటు కొనసాగుతుందని, కనుక యాజమాన్యం గుర్తించిన శ్రావణపల్లి, సత్తుపల్లి ఓసీ కొత్త బ్లాక్ లను టెండర్ ప్రక్రియ ద్వారా సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి లు మాట్లాడగా,బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను,నాయకులు సంకె అశోక్, బోగ సతీష్ బాబు,సిద్దమల్ల రాజు,ఎస్.వెంకట్ రెడ్డి,సిర్ర మల్లికార్జున్, మానాల శ్రీనివాస్,నాయిని శంకర్,గుర్రం ప్రభుదాస్,ఉప్పులేటి తిరుపతి,గొడిశల నరేష్,తదితరులు పాల్గొన్నారు.




## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

**ప్రజాపక్షం/చొప్పదండి :** చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని రజక యువజన సంఘం అధ్యక్షుడు నిజానపురం చందు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను చొప్పదండిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో మండల రజక సంఘం అధ్యక్షుడు మావురపు రాములు ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం రజాకార్లు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిని వీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ఎడవెల్లి రాజారాం, దొంతరవేణి సంపత్, పట్టణ అధ్యక్షుడు పొన్నాల శంకరయ్య, శంబయ్య, అర్థవెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తులు, కుర్చీల వితరణ

**ప్రజాపక్షం/గంగాధర :** మండలంలోని నారాయణపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి గుర్రం శ్రీధర్ శనివారం క్రీడా దుస్తులతోపాటు ప్లాస్టిక్ కుర్చీలను అందజేశారు. తాను చదివిన పాఠశాలపై మమకారంతో ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న శ్రీధర్ ఈ సహాయం అందజేశారు. వీటిని కరీంనగర్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి గిన్నె లక్ష్మణ్, జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు కొమురోజు కృష్ణ, జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు బాబు శ్రీనివాస్ చేతులమీదుగా విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఇలా ముందుకు వచ్చి పాఠశాలలకు సహకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్వప్న, ఉపాధ్యాయులు శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

## చొక్కారావుపల్లెలో ఘనంగా పోషణ మేళా

**ప్రజాపక్షం/గన్నేరువరం:** మండలంలోని చొక్కారావుపెల్లె గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం సందర్భంగా శనివారం పోషణ మేళా కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతలలో పోషకాహార లోపాన్ని నివారించడంతోపాటు సరైన ఆరోగ్య అలవాట్లపై అగవాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగింది. ఈ మేళాలో గ్రామ సర్పంచ్ అరుకొంతం గోపాలరెడ్డి, ఉప సర్పంచ్ మామిడి జైపాల్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. చిన్నపిల్లలకు, తల్లులకు పోషకాలతో కూడిన ఆహారం అందించడం వల్ల ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని అన్నారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్వైజరన్ కవిత మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న గుడ్లు, పాలు, బలవర్ధకమైన ఆహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉపేందర్, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం రజనీకాంత్ రెడ్డి, అంగన్వాడీ టీచర్ శారద, వార్డు మెంబర్ జమునలతోపాటు స్థానిక తల్లులు రేణుక, రమ్య, స్రవంతి, అనూష, రమ్య, చిన్నపిల్లలు పాల్గొన్నారు.

## సౌత్ జోన్ ఇండియా టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు రైజింగ్ సన్ విద్యార్థి ఎంపిక

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** టెన్నిస్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 28 వ తేదిన హైదరాబాద్ లోని జింఖానా మైదానంలో అండర్ 17 విభాగంలో జరిగిన సెలెక్షన్ ట్రయల్స్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్థానిక రైజింగ్ సన్ పాఠశాల విద్యార్థి ముమీజుద్దీన్ ఈ నెల 27,28 తేదీల్లో గుంటూరులో జరుగనున్న జాతీయ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు.ఈ సందర్భంగా ముమీజుద్దీన్‌ను పాఠశాల కరస్పాండెంట్ సయీద్ అహ్మద్, ప్రధానోపాధ్యాయులు హకీమ్ ఖాన్, పీఈటీ తగురం తిరుపతి మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాల, జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# మహిళా శక్తికి, ఆత్మగౌరవానికి ప్రతీక వీర వనిత చాకలి ఐలమ్మ

## కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** వీర వనిత చాకలి ఐలమ్మ ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి మహిళా శక్తికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష,అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు తో కలిసి చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చాకలి ఐలమ్మ సంఘ సేవకురాలుగా, భూమి, సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమతో వీర వనితగా చరిత్రలో నిలిచి, ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ఆత్మగౌరవానికి ప్రతీక అయిన చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పేదలు, మహిళల అభ్యున్నతికి కృషి చేస్తోందని తెలిపారు. ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఆమెకు ఘనంగా నివాళులర్పించారు.దాదాపు 80 ఏళ్ల క్రితమే తెలంగాణ గడ్డపై దొరల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటానికి జంగ్ సైరన్ మోగించారు.



ఈ కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఏం. రవీందర్, రజక సంఘ నాయకులు,జిల్లా అధికారులు,కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: ఏ ఓ శ్రీకాంత్

**ప్రజాపక్షం/పెగడపల్లి:** మండలంలోని పలు ఎరువుల విక్రయ కేంద్రాలను శనివారం మండల వ్యవసాయ అధికారి ఓ. శ్రీకాంత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని నిల్వలను,రికార్డులను పరిశీలించి, ఎరువుల డీలర్లకు పలు ముఖ్యమైన సూచనలు మరియు ఆదేశాలను జారీ చేశారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన, ప్రభుత్వ ప్రమాణాలు కలిగిన ఎరువులను మాత్రమే విక్రయించాలని స్పష్టం చేశారు. ప్రతి విక్రయానికి సంబంధించి రైతులకు తప్పనిసరిగా బిల్లు జారీ చేయాలని సూచించారు. ఎరువులను ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట చిల్లర ధర ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయించరాదని, అలా అమ్మితే లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడితే, వారిపై ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ నిబంధనల ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి ఈ సందర్భంగా హెచ్చరించారు.

## దరఖాస్తులు పరిశీలన

**ప్రజాపక్షం/సారంగాపూర్:** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామంలో వికలాంగులు, వితంతు, చేయూత కోసం పెన్షన్స్ కోసం కొత్తంగా దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను శనివారం ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజశేఖర్ పరిశీలించి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొలపాక రాధ రాజు, ఉప సర్పంచ్ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

## కంపెనీ స్థాయి కబడ్డీ, బాల్ బ్యాట్మెంటన్ పోటీల ఏర్పాట్లను పరిశీలించిన

**ప్రజాపక్షం/రామగిరి:** రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా వర్క్ పీపుల్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలోసెప్టెంబర్ 29, 30 తేదీలలో నిర్వహించే కంపెనీ స్థాయి కబడ్డీ, బాల్ బ్యాట్మెంటన్ పోటీల కోసం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో చేయవలసిన ఏర్పాట్లను శనివారం పరిశీలించిన రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, మాట్లాడుతూ కంపెనీ స్థాయి కబడ్డీ, బాల్ బ్యాట్మెంటన్ పోటీలకు క్రీడా ప్రాంగణంలో చేయవలసిన పనులు,సింగరేణి అన్ని ఏరియాల నుండి వస్తున్న క్రీడాకారులకు కావలసిన ఏర్పాట్లను చేయాలని, అలాగే వేడుకలకు హాజరయ్యే వారికీ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. వారితో పాటు రామ్మోహన్, బి.సుదర్శనం, ఎస్.రవికుమార్, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి ఎన్.వంశీధర్, క్రీడల సమన్వయ కర్త బుర్ల సదానందం,ఇతర అధికారులు,సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్ రెడ్డి పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూల మాల వేసి, పాలాభిషేకం చేసి ఆమెను స్మరించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు,భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయిందన్నారు.పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని, అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె ప్రదర్శించిన తెగువ నేటి తరాలకు ఆదర్శమని దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం,హక్కుల కోసం ఆమె చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



చాకలి ఐలమ్మ ఆశయాలను, పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, రజక సంఘం నాయకులు బొడ్డుపల్లి రమేష్, రామ్మూర్తి, కుమారస్వామి, అంజి బాబు,నవీన్ కుమార్, సంపత్, కృష్ణ, అశోక్, మల్లికార్జున్, మల్లయ్య, నాయకులు పూదరి చంద్రశేఖర్ నాంసాని సరేష్ బాబు, బిక్షపతి,కాశి పాక వాసు,అఫ్జల్ బాబా, పల్లె మధు,నూగిల వీరేశం, రాజేష్ ,నిఖిల్, పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు,అభిమానులు,స్థానిక ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## సుల్తానాబాద్‌లో

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** తెలంగాణ మట్టి ఆత్మగౌరవానికి, వీరత్వానికి నిలువెత్తు రూపం వీరనారి చాకలి ఐలమ్మ అని పలు పార్టీల నేతలు రజక సంఘం నాయకులు పేర్కొన్నారు. శనివారం చాకలి ఐలమ్మ జయంతినీ పురస్కరించుకొని మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపాన ఉన్న ఐలమ్మ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలు పార్టీల నేతలు రజక సంఘం నాయకులు మాట్లాడుతూ, దొరల అరాచకాలు, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని తన భూమి,తన హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకం అని



కొనియాడారు.మహిళల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆమె చూపిన బాటలోనే మనం పయనించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ పట్టణ మండల రజక సంఘం నాయకుల తో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,బిజెపి పార్టీ శ్రేణులు వివిధ కుల సంఘాల నేతలు పలువురు అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లిలో

**ప్రజాపక్షం/గొల్లపల్లి:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలో



రజక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ మేరకు మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం నాయకులు, ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా రజక సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ... నిజాం నిరంకుశ పాలనకు, విస్నూర్ దేశ్‌ముఖ్ లాంటి భూస్వామ్య దౌర్జన్యాలకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. నాడు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో భూమి కోసం,హక్కుల కోసం,భూస్వామ్య దొరల దోపిడికి లాఠీలకు తుపాకులకు వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడి పేద రైతులు కూలీల హక్కుల కోసం పోరాడి ఎదురొడ్డి నిలిచిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు,వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న సిరిసిల్లలో

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన వేడుకలను అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్, జిల్లా రెవెన్యూ



అధికారి జయశ్రీ హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె సేవలను, త్యాగాలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, రజక సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/రామగిరి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ అని రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు.రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా లోని జి.యం కార్యాలయం నందు స్వర్గీయ చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ముఖ్యఅతిథిగా హాజరై స్వర్గీయ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో రైతుల హక్కుల కోసం పోరాడిన వీరనారి అని, ఆమె జీవితం మనకు స్ఫూర్తి, త్యాగం మనకు మార్గదర్శనం కావాలన్నారు.తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన ధైర్య సాహసాల పాత్రను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎస్వోటుజియం యం.రామ్మోహన్, ప్రాతినిధ్య సంఘం ప్రతినిధి రవికుమార్, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, విభాగదిపతులు బి.సుదర్శనం, బి.టి.మురళీకృష్ణ, ఎస్. రవికుమార్, కె.ఐలయ్య, అఫ్సర్ పాషా,ఆర్.రాజేశ్వరి,యండి.ఆసిఫ్ యాసిన్ లతో పాటు ఇతర అధికారులు,ఉద్యోగులు,పాల్గొన్నారు.

### మల్లాపూర్‌లో

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మల్లాపూర్ వేంపల్లి గ్రామంలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 131 జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు శనివారం చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి ఆమె చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులు,రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### రాయికల్‌లో

**ప్రజాపక్షం /రాయికల్ :** చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా శనివారం రాయికల్ పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహంకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా భూస్వాములను ఎదురించి దొరల అరాచకాలను తరిమి కొట్టి,నిజాం నిరంకుశ పాలన పై,రజాకార్ల రాక్షసత్వం పై, భూమి కోసం భుక్తికోసం వెట్టిచాకిరి చేసి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అన్ని గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో రజక సంఘ సభ్యులు ధరి, గంగాధర్, రమేష్,నాగరాజు, వెంకటేష్, రమేష్, సాయిలు, రాజు తదితరులు పాల్గొన్నారు.మైతాపూర్ లో మైతాపూర్ గ్రామంలో శనివారం సాకలి ఐలమ్మ జయంతోత్సవాన్ని రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా రజక సంఘం అధ్యక్షుడు లంకదాసరి తిరుపతి మాట్లాడుతూ.. సాకలి ఐలమ్మ చూపిన ధైర్యం,తెగువ,పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.రజకుల అభ్యున్నతికి సంఘ సభ్యులంతా ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు రాజేశం,సాయిలు,గంగారాం, గంగాధర్,వినోద్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.

### సారంగాపూర్‌లో

**ప్రజాపక్షం/సారంగాపూర్:** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలో శనివారం చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చేకూట అరుణ శేఖర్, అశ్విని రమేష్, పుష్ప రాజ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సురేందర్, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### గన్నేరువరంలో

**ప్రజాపక్షం/గన్నేరువరం:** తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత, బహుజన విప్లవ పతాక చాకలి(చిట్యాల) ఐలమ్మ జయంతి వేడుకలను గన్నేరువరం మండల కేంద్రంలో శనివారం రజకుల సంఘం గ్రామ అధ్యక్షుడు మునిగంటి మల్లయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ ఇప్ప నరేందర్, ఎంపిడివో, ఇతర పార్టీ నాయకులు, వివిధ సంఘాల ప్రజా ప్రతినిధులు, నాయకులు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పంచారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తెలంగాణ నేలలో దొరల, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన ధీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మునిగంటి సత్తయ్య, మునిగంటి తిరుపతి, ప్రధాన కార్యదర్శి రాములు, కోశాధికారి శ్రీధర్, కార్యదర్శి అజయ్, మండల అధ్యక్షుడు మునిగంటి నాగరాజు, కనుకయ్య, ముఖ్య సలహాదారు మొండయ్య, పోచయ్య, బాలయ్య, యువకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విబి జి రామ్‌జి పనులపై శిక్షణ



**ప్రజాపక్షం/దిలావర్ పూర్ :** దిలావర్ పూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అరుణ రాణి అధ్యక్షతన సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, సెర్ప్ సిబ్బందికి విబి జి రామ్‌జి కార్యక్రమంపై ప్రత్యేక శిక్షణ నిర్వహించారు.గ్రామీణాభివృద్ధిని మరింత వేగవంతం చేసే లక్ష్యంతో ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు . ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా విబి జి రామ్‌జి పథకం కింద చేపట్టగలిగే 375 రకాల వివిధ అభివృద్ధి పనులపై సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పన, ఉపాధి అవకాశాల పెంపు, సర్వాంగీణ అభివృద్ధి కోసం విబి జి రామ్‌జిలో అందుబాటులో ఉన్న పనులను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఒ గోవర్ధన్, ఎంఇఒ సదానందం, ఎపిఒ దివ్య రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇతో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోటీలు



**ప్రజాపక్షం/తానూర్ :** దేశ ప్రధాని నరేంద్ర మోదీ పాలన 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా,ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని ఎల్వీ గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన,ఉపన్యాస పోటీలు నిర్వహించారు.పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బిజెపి నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నారెడ్డి ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శంకర్ హజారే, ఉపాధ్యాయులు భూమన్న యాదవ్, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

## విజిపిపి అమలుపై శిక్షణ




**ప్రజాపక్షం /తానూర్ :** వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక (విజిపిపి), వికసిత్ భారత్ ఉపాధి హామీ చట్టం 2025పై శనివారం తానూర్ రైతు వేదికలో సామర్థ్య నిర్మాణ శిక్షణ నిర్వహించారు.ఎంపీడీఓ శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఐకెపి విఒలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.గ్రామాభివృద్ధి ప్రణాళికల తయారీ, శాఖల సమన్వయం, సమర్థవంతమైన అమలుపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అమిర్ ఖాన్, విద్యాధికారి నరేందర్, ఎపిఒ శివలింగయ్య, ఎపిఎం సులోచన రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## దిల్వార్‌పూర్ ఎస్‌సి బాలుర హాస్టల్‌లో ఎంపిఒ ఆకస్మిక తనిఖీ

### విద్యార్థుల సౌకర్యాలపై ఆరా



**ప్రజాపక్షం/దిల్వార్‌పూర్ :** దిల్వార్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్‌సి బాలుర వసతి గృహాన్ని (ఎస్‌సి బాయ్స్ హాస్టల్) శనివారం మండల పరిషత్ అధికారి (ఎంపిఒ) ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు.హాస్టల్‌లోని పలు విభాగాలను తనిఖీ చేయడంతో పాటు విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు.రిజిస్టర్లు, మెనూ తనిఖీ.. పరిసరాల పరిశుభ్రతపై ఆదేశాలుసందర్శనలో భాగంగా ఎంపీఓ ముందుగా విద్యార్థుల హాజరు పట్టిక, సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్, నిత్యావసర సరుకుల స్టాక్ డీటెయిల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వంటగది (కిచెన్ రూమ్), వాష్‌రూమ్‌లు, టాయిలెట్లను తనిఖీ చేశారు.హాస్టల్ పరిసరాలు, గదులు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని,విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని హాస్టల్ వార్డెన్ మురళిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపిఒ విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారి అభిప్రాయాలు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.మెనూ ప్రకారం క్రమం తప్పకుండా భోజనం,టిఫిన్ అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అలాగే విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ, డ్రెస్ మెటీరియల్ అందుబాటు, క్రమం తప్పకుండా జరిగే హెల్త్ చెకప్‌ల వివరాలపై విద్యార్థులతో చర్చించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ఎంపిఒతో పాటు గ్రామ పంచాయతీ ఇఒ మహేందర్,హాస్టల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా 'సర్'పై కాంగ్రెస్ నిరసన



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రంలోని నిర్వహించిన సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహారశైలిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఇటీవల వెలువడిన ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదికను ప్రస్తావిస్తూ, ఎలక్షన్ కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల్లో ఓటరు జాబితా నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై కనీసం 14 సార్లు అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ నిర్ణయ ప్రక్రియపై ప్రశ్నలు తలెత్తడం ఆందోళనకరమని మల్లెపూల సత్యనారాయణ అన్నారు.సర్ ప్రక్రియలో పూర్తి పారదర్శకత, నిష్పాక్షికత ఉండాలని,ప్రజలలో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని తెలిపారు.అదే సమయంలో,ఎన్నికల కమిషన్ వర్గాలు మాత్రం సర్‌తో సహా అన్ని నిర్ణయాలు ముగ్గురు ఎన్నికల కమిషనర్ల సమష్టి ఆమోదంతోనే తీసుకున్నామని స్పష్టం చేసిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యుడు షేక్ యూసుఫ్ షాకీర్ అమీర్ బోథ్ కాంగ్రెస్ పార్టీ ఉపఅధ్యక్షుడు కౌసర్, వార్డ్ మెంబర్ షాకీర్, గిరీష్, శేమేందర్ రెడ్డి, అబ్రారర్, అమీరుద్దీన్, అబ్దుల్, హాసిఫ్, దొరా శేఖర్, తహేవర్, అమీర్ బేగ్ , పలువురు, నాయకులు పాల్గొన్నారు.

## విద్య ప్రైవేటీకరణ, నిరుద్యోగంపై వ్యతిరేకంగా పోరాడుదాం

### భైంసాలో ఘనంగా భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలు




**ప్రజా పక్షం/భైంసా :** భైంసా పట్టణంలోని వశిష్ట జూనియర్ కళాశాలలో శనివారం అమరవీరుడు కామ్రేడ్ భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం,ప్రగతిశీల మహిళా సంఘం నిర్మల్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు వి.మహేందర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి వక్తలు పిఒడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి , టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాజన్న మాట్లాడుతూ. భగత్ సింగ్ కేవలం 23 ఏళ్ల వయస్సులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేశారని, నేటి యువత ఆయన ఆశయాలను, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదం కేవలం నినాదం కాదని,అది సమాజంలోని అన్యాయం, అవినీతి, నిరుద్యోగంపై నిరంతరం పోరాడే స్ఫూర్తి అని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చదువులో ముందంజలో ఉంటూ చె డు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కిరణ్ కుమార్, టియుసిఐ జిల్లా నాయకురాలు వి.గోదావరి, అధ్యాపకులు గంగాధర్, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

## భవిషత్తు అవసరం కోసం ప్రతి నీటి బొట్టు ఒడిసిపట్టాలి

### ఎంపిడిఒ లవకుమార్



**ప్రజాపక్షం/ముధోల్ :** రాబోయే భవిషత్తు అవసరాల కొరకు ముందస్తు జాగ్రత్తగా ఇప్పటినుండే ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలని ఎంపిడిఓ లవకుమార్ పిలుపునిచ్చారు.శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ప్రత్యేకాధికారి లక్ష్మణ్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్ లు,పంచాయతీ కార్యదర్శి లకు నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీరు వ్యర్థం చేస్తే రాబోయే తరాల మనుగడ కష్టమన్నారు. విబి–జీ రాంజి పథకంలో ప్రభుత్వం నీటిని సంరక్షించడానికి వివిధ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.పంటల సాగుకోసం నీటి నిలువ కొరకు పంట కుంటలు,ఊట కుంటలు,బోరు బావుల రీఛార్జు చేయడం అదేవిధంగా మనం వాడిన నీటితో భూగర్భ జలాల పెరుగుదల కొరకు ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడం వంటి పథకాలను అమలు చేస్తోందని వివరించారు.ఎల్ నినో ప్రభావం నుండి బయట పడాలంటే నీటి సంరక్షణ కొరకు ప్రభుత్వం అందిస్తున్న సూచనలు తప్పక పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, టిఎలు,ఎఫ్‌ఎలు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం /నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్ కు చెందిన ఎంబడి లింగన్న కుమారుడు శివ కుమార్ ఇటీవల సాయి బాబా గుడి దగ్గర గణపతి నిమజ్జన కార్యక్రమానికి వెళ్లే క్రమంలో విద్యుత్ షాక్కు గురై మృతి చెందాడు. లింగన్న కుటుంబ సభ్యులను నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షులు,భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.సత్యనారాయణ గౌడ్ శనివారం పరామర్శించారు.చిన్న వయసులో శివకుమార్ మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆయన మృతి పట్ల శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అయన భార్య, చిన్నపిల్లలను కు టుంబ సభ్యులకు భగవంతుడు వారికి మనోధైర్యం కల్పించాలన్నారు.ఆయన వెంట గురుస్వామి మాజీ సర్పంచులు శనిగరపు చిన్నయ్య, గంగయ్య, నర్సయ్య, రమణ గౌడ్, తదితరులు ఉన్నారు.

## డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/బోథ్ :** భారత మాజీ ప్రధానమంత్రి, ప్రముఖ ఆర్థికవేత్త, మహోన్నత ప్రజాసేవకుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా బోథ్ మండల కాంగ్రెస్నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూడాక్టర్ మన్మోహన్ సింగ్ జీవితం దేశ ప్రజలకు గొప్ప సందేశాన్ని అందిస్తుందని అన్నారు. పదవి శాశ్వతం కాదు దేశానికి ప్రజలకు చేసిన సేవే శాశ్వతం అనే స్ఫూర్తిని ఆయన ప్రజాజీవితంచాటిచెప్పిందన్నా.ఈ కార్యక్రమంలో బోథ్ మండల కాంగ్రెస్‌అధ్యక్షులు మేరుగు భోజన్న, ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, టిపిసిసి ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షుడు కుర్మే మహేందర్, బోథ్ మండల కాంగ్రెస్ అధికార ప్రతినిధి అలపాటి అచ్యుత్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ఎస్.కె. అబుద్, పిఎసి సభ్యుడు వి.సురేందర్, బిఎల్‌ఎ2 విజయ రాజా రెడ్డి, ఆత్మ డైరెక్టర్ రహీముద్దీన్, వార్డ్ సభ్యుడు సోహెల్, రియాజుదీన్, అలీమ్ భాయ్, తదితరులు పాల్గొన్నారు.

## బిలోలిలో చెత్త బుట్టల పంపిణీ



**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని బిలోలి గ్రామంలో గ్రామ సర్పంచ్ నివేదిత రాజశేఖర్, అధికారులు ఎంపిఒ సొలమన్ రాజ్ గ్రామంలో చెత్త బుట్టలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరూ చెత్త బుట్టలను సద్వినియోగం చేసుకోవాలని అలాగే గ్రామంలోని ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం జరిగిందని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొడదామని తెలిపారు ప్రతి ఒక్కరూ ఇంటి ముందర ఆవరణ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని,మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సర్పంచ్ పలు సూచనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ వార్డు సభ్యులు,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ధీరజ్‌కు సత్కారం

**ప్రజాపక్షం/తానూర్ :** తానూర్ మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన జెడ్‌పిహెచ్‌ఎస్ హిందీ ఉపాధ్యాయుడు ధీరజ్‌ను ఝరి(బి) గ్రామ పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయురాలు అలేఖ్య, ఉపాధ్యాయ బృందం,యువ నాయకుడు గైక్వాడ సాయినాథ్,పాఠశాలలో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా యువ నాయకుడు గైక్వాడ్ సాయినాథ్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ,విలువలు నేర్పే ఉపాధ్యాయుల కృషి సమాజాభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.అవార్డుకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేందర్, ఓం ప్రకాష్, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం




**ప్రజాపక్షం / కౌటాల :** అన్యాయాన్ని ఎదిరించి హక్కుల కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని సర్పంచ్ నక్క శంకర్ పేర్కొన్నారు. కౌటాల మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జెండా ఎగురవేసి ఐలమ్మకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పసునూరి తిరుపతి, రజక సంఘం నాయకులు, సభ్యులు, యువత, ప్రజలు పాల్గొన్నారు.

## ఐలమ్మ పోరాట పటిమ స్ఫూర్తిదాయకం



తెలంగాణ సాయుధ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ చూపిన ధైర్యం, పోరాట పటిమ భావితరాలకు ఆదర్శమని తెలంగాణ రక్షణ సేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కావేటి సబిత మనోహర్, జిల్లా అధ్యక్షుడు వినోద్ కొనియాడారు. పట్టణ కేంద్రంలోని మేరా భవనంలో శనివారం చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజక మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఐలమ్మ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, రజక సంఘం ప్రతినిధులు, పట్టణ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడాలి

### ఫారెస్ట్ రేంజ్ అధికారి ఖాదర్ వలీ



**ప్రజాపక్షం / జన్నారం :** గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని జన్నారం ఫారెస్ట్ రేంజ్ అధికారి ఖాదర్ వలీ సూచించారు. శనివారం మండలంలోని కలమడుగు వివేకానంద పాఠశాలను ఆయన సందర్శించి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమ నివాసాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పేర్కొన్నారు. అడవుల పరిరక్షణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. సెన్సిటివ్ జోన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారి శేషారాం, బీట్ అధికారులు రాజేశ్వర్, రవి, పాఠశాల కరస్పాండెంట్ సతీష్ గౌడ్, ఇన్‌చార్జి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యం



**ప్రజాపక్షం / వాంకిడి :** పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులే మెంగాజీ పేర్కొన్నారు. వాంకిడి మండలంలోని గోయగాం గ్రామ పంచాయతీ పరిధిలో అర్హులైన లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శనివారం నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి ఘనంగా భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యతా ప్రమాణాలతో గృహాలను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణం పూర్తయితే పేద కుటుంబాలకు శాశ్వత వసతితో పాటు సామాజిక భద్రత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ జిల్లా వైస్ చైర్మన్ మొండయ్య, గోయగాం సర్పంచ్ ఇసురు బాయ్, బంబార సర్పంచ్ కృష్ణాజీ, మండల ఉపాధ్యక్షులు పెంటు, మారుతి, రమేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉప్పుల కృష్ణ, మాజీ సింగిల్ విండో చైర్మన్ దాదాజీ, ధన్వాల్కర్ కమలేష్ బంటి, శివాజీ, విలాస్, మడుపతి సీతారాం, గంగాధర్, పందిర్ల గుండయ్య, డికొండ మహేష్, అస్పాక్, అజ్జుమ్ దేవన్న, చాంద్ పాషా, షేక్ జమీర్, షేక్ యూసుఫ్, మడవి బండు పాల్గొన్నారు.

## ఇందాని రహదారి మరమ్మతులు చేయకుంటే పాదయాత్ర



**ప్రజాపక్షం / వాంకిడి :** ఇందాని గ్రామ రహదారికి వెంటనే పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టకపోతే జిల్లా కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహిస్తామని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి గొడిసెల కార్తీక్ హెచ్చరించారు. వాంకిడి మండలంలోని ఇందాని గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారడంతో శనివారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రహదారి పరిస్థితిని పరిశీలించి మాట్లాడారు. రహదారిపై ఏర్పడిన భారీ గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోయి వాహనదారులు, విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని, అత్యవసర సమయాల్లో గ్రామాల్లోకి అంబులెన్సులు సైతం రాలేని దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నాణ్యమైన రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి పనులు ప్రారంభించకుంటే కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కోశాధికారి దుర్గం నిఖిల్, నాయకులు రవి, బాలాజీ, శంకర్, రమేష్, కేశవ్, భీమ్రావు, మారుతి పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలతోనే చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు



**ప్రజాపక్షం / మంచిర్యాల టౌన్ :** చిన్నారులు పాఠశాల వాతావరణానికి అలవాటు పడేలా అవసరమైన మానసిక పరిపక్వత, తగిన ప్రోత్సాహం అంగన్‌వాడీ కేంద్రాల్లోనే లభిస్తుందని 40వ వార్డు కార్పొరేటర్ శశికళ పేర్కొన్నారు. జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా రాంనగర్ సెక్టార్ పరిధిలోని ముస్లిం బస్తీ రెండు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ముందస్తు బాల్య సంరక్షణ, విద్య దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ శశికళ, బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల శారీరక, మానసిక వికాసానికి పూర్వ ప్రాథమిక విద్య ఎంతో దోహదపడుతుందని తల్లిదండ్రులకు వివరించారు. కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని గర్భిణులు, బాలింతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్త లావణ్య, సహాయకురాలు నఫీజ్, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



**ప్రజాపక్షం / కౌటాల :** జర్నలిస్టులకు ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, ప్రధాన కార్యదర్శి ఎస్. సంపత్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం కౌటాల మండల కేంద్రంలో యూనియన్ జిల్లా మూడవ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని గుర్తుచేశారు. ప్రభుత్వాలు మారుతున్నా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, ఇళ్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అక్టోబర్ 7న ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఏడే గార్డెన్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించే జిల్లా మహాసభను జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ గౌడ్, నవీన్ గౌడ్, రాధాకృష్ణచారి, అమూల్ గౌడ్, కె. నరేష్, చకినాల సురేష్, కె. రవీందర్ పాల్గొన్నారు.

## యూనిఫాం పంపిణీ

**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని విధాలా మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని గ్రామ సర్పంచ్ కొండ్ర సులోచన తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట్ మండలంలోని కమ్మర్గాం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన యూనిఫాంలు, బిస్తర్లు, ప్లేట్లను శనివారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి ఎంతో అవసరమన్నారు. ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ నైతిక విలువలను అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రమదానంతో బురద రోడ్డు బాగుచేసిన యువత

**ప్రజాపక్షం / వాంకిడి :** వర్షాలకు తీవ్రంగా దెబ్బతిని బురదమయంగా మారిన ప్రధాన రహదారిని స్థానిక యువత శ్రమదానంతో బాగుచేసి రాకపోకలకు అనుకూలంగా మార్చారు. వాంకిడి మండలంలోని బంబార గ్రామంలో ప్రధాన రోడ్డు వర్షాల కారణంగా గుంతలమయమై బురద పేరుకుపోవడంతో వాహనదారులు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్ల రాకపోకలు స్తంభించిపోవడంతో రహదారి పక్కన ఉన్న దుకాణాల యజమానులు, ఆటో డ్రైవర్లు, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. రహదారిపై పేరుకుపోయిన బురదను పారలతో తొలగించి, గుంతలను మట్టితో పూడ్చి రాకపోకలను పునరుద్ధరించారు. యువత చేసిన సేవలను గ్రామస్తులు అభినందించారు. వర్షం కురిసిన ప్రతిసారీ ఇదే సమస్య పునరావృతమవుతోందని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని స్థానికులు అధికారులను కోరారు.

## విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

### గిరిజన సంక్షేమ శాఖ డిడి అంబాజీ



**ప్రజాపక్షం / వాంకిడి :** గిరిజన సంక్షేమ పాఠశాలల్లో విధుల్లో నిర్లక్ష్యం, సమయపాలన లోపం, విద్యార్థుల విద్యాభ్యాసంపై అలసత్వం వహిస్తే నిబంధనల ప్రకారం శాఖాపరమైన చర్యలు తప్పవని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ హెచ్చరించారు. ఉపాధ్యాయులు అంకితభావంతో, పూర్తి బాధ్యతతో పనిచేయాలని స్పష్టం చేశారు. శనివారం మండల కేంద్రంలోని స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల పనితీరు, ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు, బోధనా విధానాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఆయన సమీక్షించారు. ప్రాథమిక విద్య భవిష్యత్తుకు బలమైన పునాది అని, ప్రతి విద్యార్థి స్థాయిని గుర్తించి బోధన అందించాలని సూచించారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ బోధనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను నిరంతరం అంచనా వేయాలన్నారు. సమయానికి బదులకు హాజరై బోధనకు పూర్తి సమయం కేటాయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎసిఎంఓ పూర్కా ఉద్ధవ్, జిల్లా క్రీడల అధికారి మాడావి శేఖు, చిరంజీవి, ప్రధానోపాధ్యాయులు నారాయణమూర్తి, సోయం ఇంద్రబాయి, పవార్ లింబారావు, ఎస్సీఆర్పీలు రాథోడ్ రవీందర్, కుడ్మేత అనంత్, మనోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోషణ్ కిట్ల పంపిణీ

### డిఎంహెచ్ఓ నాగేంద్ర



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** క్షయ వ్యాధిగ్రస్తులకు దాతలు ముందుకొచ్చి నిక్షయ్ పోషణ్ కిట్లు అందించడం ఎంతో అభినందనీయమని జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ నాగేంద్ర తెలిపారు. కాగజ్ నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో కార్మెల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 25 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పోషణ్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్షయవ్యాధిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వ్యాధిగ్రస్తులు త్వరగా కోలుకోవడానికి పోషకాహారం ఎంతో అవసరమని, దాతల సహకారం బాధితులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్మెల్ ఎడ్యుకేషనల్ సొసైటీ, జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం బృందం సమన్వయంతో బాధితులకు అండగా నిలవడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ సీతారాం, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినయ్, జిల్లా సమన్వయ అధికారి పవన్, ఎన్‌టిఇపి సిబ్బంది, కార్మెల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రిన్సిపాల్, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అఖండ జ్యోతి సంపూర్ణ కార్యక్రమం



**ప్రజాపక్షం/నేరడిగొండ:** లఖంపూర్ రామ గిరి మహారాజ్ ఆశ్రమంలో అఖండ జ్యోతి సంపూర్ణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ హాజరై పూజలు చేశారు. ఆశ్రమంలో రామాలయ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## తేజాపూర్‌లో చాకలి ఐలమ్మ జయంతి



**ప్రజాపక్షం/నేరడిగొండ:** తేజాపూర్ గ్రామంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను రజక సంఘం మండల కన్వీనర్ జె. శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దొరల అరాచకాలపై పోరాడిన ఐలమ్మ ఆత్మగౌరవ పోరాట స్ఫూర్తిని అందరూ పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రిమ్స్ ఎదుట చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/మావల:** ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి ఎదుట చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం రాష్ట్ర సహాయ కార్యదర్శి నళిని రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు అమీనా ఖాన్ మాట్లాడుతూ వెట్టిచాకిరీపై పోరాడిన ఐలమ్మ తెగువ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో మడావి పుష్ప, సభ్యులు పాల్గొన్నారు.

## మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



**ప్రజాపక్షం/నేరడిగొండ:** నేరడిగొండ భవిత మండల సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామ సంఘాల ప్రతినిధులకు ఆర్థిక అక్షరాస్యతపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సెర్ప్ ప్రతినిధులు కుసుమ కుమారి, కృష్ణవేణి హాజరై సంఘాల నిర్వహణ, చిరు వ్యాపారాల ద్వారా మహిళా సాధికారత సాధించే మార్గాలను వివరించారు. కార్యక్రమంలో భవిత సమాఖ్య అధ్యక్షురాలు తీగల లలిత, ఏపీఎం వెంకట్‌రెడ్డి, సీసీలు పాల్గొన్నారు.

# ఘనంగా గణనాథుల నిమజ్జనం

**ప్రజా పక్షం /ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణంలో గణేష్ నిమజ్జనోత్సవం అత్యంత ఘనంగా, భక్తి శ్రద్ధలతో జరిగింది. గత 12 రోజులుగా భక్తుల పూజలందుకున్న గణనాథులు నిమజ్జనానికి బయలుదేరడంతో పట్టణమంతా కోలాహలంగా మారింది. ఖానాపూర్ పట్టణంలోని వివిధ కాలనీలు, వీధుల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను డీజే మోతలు, డప్పు చప్పుళ్లు, భక్తి పాటల నడుమ ఊరేగింపుగా తరలించారు. యువకులు గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలు చేస్తూ నృత్యాలతో హోరెత్తించారు. ప ట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన నిమజ్జన శోభాయాత్రను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు . పోలీసు, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సదర్మాట్ ప్రాజెక్టు, స్థానిక చెరువుల వద్ద



క్రేన్ల సహాయంతో నిమజ్జనం సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత,కమిషనర్ సుందర్ సింగ్, ఖానాపూర్ సర్కిల్ పరిధి పోలీసులు, పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు

### జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** నాణ్యమైన విత్తనాలతోనే రైతులకు అధిక దిగుబడులు సాధ్యమవుతాయని జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటి తెలిపారు. వాంకిడి, కెరమెరి, ఆసిఫాబాద్ మండలాల పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో, నాబార్డ్ ఆర్థిక సహకారంతో, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సమన్వయంతో రైతులకు విత్తనోత్పత్తిపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటి, ఆసిఫాబాద్ ప్యాక్స్ చైర్మన్ అలీబిన్ అహ్మద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి మాట్లాడుతూ కంది తక్కువ ఖర్చుతో ఎక్కువ నికర ఆదాయాన్ని తెచ్చే పంట అని పేర్కొన్నారు. రైతులు రాబోయే రబీ సీజన్ సాగు ప్రణాళికపై దృష్టి సారించాలని, నీటి వినియోగం ఎక్కువగా ఉండే పంటల జోలికి వెళ్లకుండా పప్పుధాన్యాలు, జొన్న, సజ్జ వంటి ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. అనంతరం ప్యాక్స్ చైర్మన్ అలీబిన్ అహ్మద్ మాట్లాడుతూ రైతులు స్వయంగా విత్తనోత్పత్తి చేపట్టడం ద్వారా సాగు ఖర్చులు తగ్గుతాయన్నారు. రైతు నుంచి రైతుకే విత్తనం విధానంతో తక్కువ ఖర్చుతో మేలైన విత్తనాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిఐ మిలింద్, ఆసిఫాబాద్ ప్యాక్స్ వైస్ చైర్మన్ ఆర్. ప్రహ్లాద, ప్యాక్స్ చైర్మన్లు రమణ, ఓమాజీ, విజయ్, ఆదర్శ రైతులు కేంద్రీ బాలాజీ, రామ్ చందర్, మహాదు, రైతులు పాల్గొన్నారు.

# సెంట్రలైజ్డ్ కిచెన్ భోజనం అందించాలి

### నీరటి రామ్ ప్రసాద్

**ప్రజాపక్షం / జన్నారం :** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా జన్నారం మండలంలోని ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు వెంటనే టిఫిన్, మధ్యాహ్న భోజనం సరఫరా చేయాలని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం జన్నారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి ఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రలైజ్డ్ కిచెన్ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా జన్నారం మండల విద్యార్థులకు భోజనం సరఫరా చేయకపోవడం తీవ్ర వివక్షేనని మండిపడ్డారు. పక్కనే ఉన్న దండేపల్లి మండలానికి భోజనం సరఫరా చేస్తూ జన్నారం మండ



లాన్ని పూర్తిగా విస్మరించడం ఎంతమాత్రం సరికాదన్నారు. వెంటనే మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, విద్యాసంస్థలకు టిఫిన్, భోజన సౌకర్యం కల్పించాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థుల పక్షాన పెద్ద ఎత్తున పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎఫ్ మండల నాయకులు కార్తీక్, మహేష్, సాయికృష్ణ, అభితో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలి



**ప్రజాపక్షం / కాగజ్‌నగర్ :** సిర్పూర్ పేపర్ మిల్లులో కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ డిమాండ్ చేశారు. ఎన్నికల నిర్వహణను కోరుతూ మిల్లు గేటు ఎదుట కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 130వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కమిటీ సభ్యులు రాములు నాయక్, అఖిల భారత మహిళా కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి అదితతో కలిసి సంఘీభావం ప్రకటించారు. అనంతరం కాగజ్‌నగర్‌లోని అదిత నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు ఎన్నికలు నిర్వహించి కార్మికులు తమకు నచ్చిన కార్మిక సంఘాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. ఆర్టీసీలో ఎన్నికలు జరుపుతున్నప్పుడు సిర్పూర్ పేపర్ మిల్లులో ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. కార్మికుల హక్కైన ఎన్నికలను ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా ప్రకటించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు, పేపర్ మిల్లు కార్మికులు, తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ సామాజిక తనిఖీ సభ

**ప్రజాపక్షం/నేరడిగొండ:** నేరడిగొండ రైతు వేదికలో ఎంపిడిఒ అధ్యక్షతన 16వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. అడిషనల్ డిఆర్‌డిఒ, డివిఒ హాజరై పనుల పురోగతిని సమీక్షించి, పలు అవకతవకలపై విచారణ చేపట్టారు.

ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, ఎంపిడిఓలు శ్యామ్ సుందర్ రెడ్డి, శేఖర్, ఉపాధి హామీ సిబ్బంది, కార్యదర్శులు, కూలీలు పాల్గొన్నారు.

# జెండా పౌర్ణమి వేడుకలతో కిటకిటలాడిన ఆలయాలు



**ప్రజాపక్షం /తానూర్ :** మండల కేంద్రంలోని మహాలక్ష్మి, పోచమ్మ, ఆలయంలో శనివారం జెండా పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా మహాలక్ష్మి ఆలయంలో స్థానిక సర్పంచ్ జాదవ్ సుగంధ బాయిమాధవరావు పటేల్ దంపతులు, అభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. భక్తులు మొక్కులు చెల్లించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు నవీన్ పాఠక్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జెండా పౌర్ణమి సందర్భంగా ఆలయ,గ్రామ కమిటీ, సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పోశెట్టి, ఉప అధ్యక్షుడు అనిల్, మాజీ సర్పంచ్‌లు తాడేవార్ విట్టల్,రాములు, ఆలయ, గ్రామ కమిటి సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు త్వరగా అందించాలి

### కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మెంగాజీ



**ప్రజాపక్షం / వాంకిడి :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు త్వరగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులే మెంగాజీ కోరారు. వాంకిడి మండలంలోని బంబార గ్రామ పంచాయతీ గొల్లగూడ వాడలో చేపట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనుల పురోగతిని శనివారం పార్టీ నాయకులు పరిశీలించారు. ఇంటి స్లాబ్ పనులు పూర్తయిన నేపథ్యంలో సంబంధిత రికార్డుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం మెంగాజీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న గృహ నిర్మాణ పథకం ప్రయోజనాలు లబ్ధిదారులకు సకాలంలో చేరేలా చూడాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేందుకు అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బంబార సర్పంచ్ బెండారే కృష్ణాజీ, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కడప మారుతి, సెల్వాట్కర్ పెంటు, పట్టణ అధ్యక్షుడు ధన్వల్కర్ కమలేష్ బంటి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డి.కొండ మహేష్, ఎస్సి సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లూరి మొండయ్య, ఎస్సి సెల్ మండల అధ్యక్షుడు చునర్కర్ శివాజీ, సీనియర్ నాయకులు మండోకర్ ధధాజీ, పందిర్ల గుండయ్య, సామల రమేష్, గంగాధర్, కొబ్రగడే విలాస్ తదితరులు పాల్గొన్నారు.

# దసరా నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి కావాలి: ఎంపిడిఓ



**ప్రజాపక్షం / జైపూర్ :** ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను దసరా నాటికి పూర్తి చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపూరావు లబ్ధిదారులకు సూచించారు. జైపూర్ మండలం ఇందారం గ్రామ పంచాయతీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో వితంతువు, వికలాంగులు, ఒంటరి మహిళ పెన్షన్ దరఖాస్తుదారులను క్షేత్రస్థాయిలో విచారించి యాప్‌లో వివరాలు నమోదు చే శారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా నోటీసులు అందిన ఓటర్లు సంబంధిత ధృవపత్రాలను బూత్ స్థాయి అధికారి లేదా గ్రా మ పంచాయతీ అధికారికి సమర్పించి ఎస్ఐఆర్ ప్రక్రియను త్వ రగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఫయాజ్, ఉపసర్పంచ్ శివ, గ్రామ పంచాయతీ అధికారి శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

